క్లుప్తంగా

## రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

**గుంటూరు ఎడ్యుకేషన్:** సంగడి గుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ-శంకర నేత్ర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరంలో పెదకాకానిలో శంకర నేత్ర వైద్యశాల వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి శుక్లాల శస్త్రచికిత్స ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## నేటి సాయంత్రం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా



**నెహ్రూనగర్:** నగరంలో తాగునీటి పైపులైన్ లీకుల మరమ్మతు పనులు గురువారం రాత్రికి పూర్తి అవుతాయని, శుక్రవారం ఉదయం పాక్షికంగా, సాయంత్రం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా చేస్తారని నగర కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌కి నీరు సరఫరా చేసే 1000 ఎంఎం డయా పైప్ లైన్‌పై ఏర్పడిన లీకులను సరిచేసేందుకు బుధవారం సాయంత్రం నుంచి ఇంజినీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు.

## 3,4 తేదీల్లో జేకేసీ కళాశాలలో జాతీయస్థాయి సదస్సు



**గుంటూరు ఎడ్యుకేషన్:** జేకేసీ కళాశాలలో ఏప్రిల్ 3, 4వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు తెలిపారు. గురువారం జేకేసీ కళాశాలలో సదస్సు బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ "ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ కంప్యూటర్ సైన్స్" అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో భాగంగా పీజీ, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, ఐటీ నిపుణులు తమ నూతన ఆవిష్కరణలను సమర్పించవచ్చునని తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌పై సైబర్ సెక్యూరిటీ, డీప్ లెర్నింగ్, బిగ్‌డేటా ఎనలిటిక్, డేటా మైనింగ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, క్లౌడ్ కంప్యూటింగ్, రీసెంట్ అడ్వాన్స్‌మెంట్స్‌పై చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జె. మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ పి. గోపీచంద్, సదస్సు కన్వీనర్ వై. సురేష్‌బాబు, కో-కన్వీనర్ వై. వెంకటేశ్వరరావు, ఐక్యూఏసీ సమన్వయకర్త టి. బాల నరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## లేపాక్షి ఎంపోరియంలో డిస్కౌంట్ అమ్మకాలు



**నగరంపాలెం:** స్థానిక బ్రాడీపేటలోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్ సందర్భంగా ఎంపిక చేసిన వస్తువులపై డిస్కౌంట్ అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఎం.వి. ఎస్.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వస్తువులపై 10 నుంచి 40 శాతం వరకు రాయితీ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు రాయితీ ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## డీఆర్ఎం ఆకస్మిక తనిఖీ



**తెనాలిరూరల్:** తెనాలి రైల్వేస్టేషన్‌ను విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనంద్‌రావ్ పాటిల్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా వచ్చిన ఆయన సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం, ఇతర రైల్వే విభాగాల కార్యాలయాలు, ఉత్తర క్యాబిన్, స్టేషన్‌లోని ప్లాట్ ఫాంలతో పాటు రైల్వే ట్రాక్‌లను పరిశీలించారు. స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఆరా తీశారు. ప్రయాణికుల భద్రత కోసం రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ, తెనాలి నుంచి గుంటూరు వెళ్లే రైలు మార్గం అభివృద్ధి చేసే అంశాలను అధికారులతో చర్చించారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ టి.వెంకటరమణ తదితరులు ఉన్నారు.

# వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- గ్రామ గ్రామాన ఆసుపత్రుల నిర్మాణం
- వైద్య కళాశాలల నిర్మాణంలో కొత్త చరిత్ర
- మంత్రి విడదల రజిని
- సెయింట్ జోసఫ్‌లో డయాలసిస్ యూనిట్ పరిశీలన



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

**గుంటూరు మెడికల్:** వైద్య, ఆరోగ్య రంగంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం స్థానిక సెయింట్ జోసఫ్ హాస్పిటల్‌లో జరిగిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదలందరికీ ఉచితంగా వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రుల్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేశారని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్రంలో 90 శాతానికి పైగా కుటుంబాలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుతున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామగ్రామాన డాక్టర్ వైఎస్సార్ విల్లేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజల ఇంటికి చేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒకేసారి 17 ప్రభుత్వ కళాశాలల నిర్మాణానికి సీఎం శ్రీకారం చుట్టారని, భారత దేశ చరిత్రలో ఇది రికార్డని తెలిపారు. కిడ్నీల వ్యాధుల్ని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తుందని మంత్రి చెప్పారు. కిడ్నీ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సైతం ప్రత్యేక ఆసుపత్రి నిర్మాణం చేపట్టి బాధితుల కోసం ప్రత్యేక వైద్య సేవల్ని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి వారి అండదండలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఆసుపత్రిలో కిడ్నీ రోగులకు చికిత్స అందిస్తున్న డయాలసిస్ యూనిట్‌ను సందర్శించి ప్రశంసించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, రెడ్ క్రాస్ నేతలు వడ్లమాను రవి పాల్గొన్నారు.

**దళితుల సంక్షేమానికి పెద్ద పీట**

**పట్నంబజారు:** దళితుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం తమదేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. గుంటూరు నగరం 38వ డివిజన్ గుజ్జనగుండ్లలో రూ.25 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గురువారం ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. అక్కడే రూ.10 లక్షలతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున నెలకొల్పడంతో సముచిత గౌరవం కల్పించినట్లు మంత్రి అన్నారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే సామాజిక సమతుల్యం దెబ్బతింటుందంటూ కోర్టులో తెలుగుదేశం పార్టీ దారుణమైన పిటిషన్లు వేసిందని గుర్తుచేశారు. చంద్రబాబుకు మొదటన్నుంచి దళితులంటే చిన్నచూపు అని దుయ్యబట్టారు. నవరత్నాల పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేద కుటుంబాలన్నీ లబ్ధి పొందాయని పేర్కొన్నారు. గుంటూరు నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి రజిని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ ఇన్‌చార్జి బొగిశం ప్రసాద్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రజినికి స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళలు

# ప్రణాళికబద్ధంగా విధులు నిర్వహించాలి

- నగర కమిషనర్, తూర్పు ఈఆర్వో కీర్తి చేకూరి
- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలతో సమీక్ష సమావేశం



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

**నెహ్రూనగర్:** ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయటానికి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు (ఎంసీసీ) ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కోడ్ వచ్చిన వెంటనే ఎంసీసీ బృందం విధుల్లో ఉండాలని, రాజకీయ పార్టీల పోస్టర్స్, బ్యానర్స్, హోర్డింగ్స్, బోర్డులను తక్షణం తొలగించాల్సి ఉంటుందన్నారు. ప్రింటింగ్ ప్రెస్ పేరు, అభ్యర్థి, పార్టీ పేర్లు లేకుండా పోస్టర్స్, బ్యానర్స్ ప్రింట్ చేస్తే వాటిని సీజ్ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, పార్టీలు, అభ్యర్థుల ఖర్చులు, అనధికారికంగా తరలించే మద్యం, నగదు, బహుమతులను అరికట్టేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ప్రతి రోజు ఎన్నికల సంఘం నిర్దేశించిన పద్ధతిలో వివరాలను రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. ఒక్కో టీంకు పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శి, దళం సభ్యులను కేటాయిస్తూ ఆదేశాలు ఇవ్వాలని ఏఈఆర్ఓ, సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓలు ప్రదీప్ కుమార్, శేషన్న, మాస్టర్ ట్రైనీలు, ఎంసీసీ విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**క్లెయిమ్స్ యుద్ధ ప్రాతిపదికన పరిష్కారించాలి**

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాపై అందిన అర్జీలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కారించాలని, ఇందుకు బీఎల్ఓలు, సూపర్వైజరీలు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఈఆర్ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాపై అందిన ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై సూపర్వైజరీ అధికారులతో తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితాపై అందిన ఆర్జీలను వెంటనే పరిష్కారించాలని, బీఎల్ఓల వారీగా పెండింగ్ వివరాలను సూపర్వైజరీ అధికారులు సమీక్షించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు తమకు సూపర్వైజరీ అధికారుల సంతకాలతో అందిన ఆర్జీలను ఏఈఆర్ఓ, ఆర్ఓ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల విభాగ సూపరింటెండెంట్లు సూపర్వైజరీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

## ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి



ప్రసంగిస్తున్న రచయిత్రి సుజాత

**లక్ష్మీపురం:** రామాయణాన్ని సాధారణ ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలుగులో రచించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ అని రచయిత్రి ఏవీకే సుజాత అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రి పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. 871 శ్లోకాలు, 8 ఖండాలుగా పాఠకులకు అర్థమయ్యే రీతిలో తాళ పత్ర గ్రంథాలపై మొల్లమాంబ రామాయణాన్ని లిఖింపజేశారన్నారు. రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మొల్ల అసలు పేరు ఆతుకూరి మొల్లమాంబ అని ఆమె 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అని తెలిపారు. ఆమె రచనా శైలి చాలా సరళమైందని రమణీయమైనదన్నారు. పలువురు సంస్థ సభ్యులు, మనము పాడుదాం రండి బృంద సభ్యులు, గాయకులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్మరణ.. అందరి బాధ్యత



సభలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

**తెనాలిటౌన్:** పోలీసు కాల్పులలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరించుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని గరువుపల్లిలోని సచివాలయం-2 వద్ద బుధవారం రాత్రి అమరవీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 1968లో జరిగిన పోలీసు కాల్పుల్లో మృతి చెందిన మంచికలపూడి సుబ్బారావు, మునిపల్లి క్రిష్టాఫర్ లను స్మరించుకుంటూ పల్లె తొలితరం పోరాట యోధులకు పలువురు నాయకులు, వక్తలు జోహార్లు అర్పించారు. సామాజిక వేత్త ఉన్నం లక్ష్మయ్య అధ్యక్షత జరిగిన సభలో ఆ రోజుల్లో జరిగిన సంఘటనలు, కుల వ్యవస్థ గురించి పలువురు వక్తలు ప్రసంగించారు. కళల కాణాచి కొలకలూరు చరిత్ర గురించి డాక్యుమెంటరీ రూపంలో తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కర్రసాము, కత్తిసాము, నాట కాలు, డప్పు కళాకారులు, కబడ్డీ, క్రీడాకారులు, కవులు, కళాకారులు, రచయితలకు నిలయమైన కొలకలూరు గురించి రాబోయే తరాలను తెలియజేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఎఎన్‌యు ప్రొఫెసర్ డాక్టర్ పీజే రత్నాకర్, బుద్దిస్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంగ్రపాటి అశోక్ కుమార్, దళిత నాయకుడు సాంబశివరావు, విశ్రాంత పోస్టల్ ఉద్యోగి సుద్దపల్లి శరత్ వెంకయ్య, కళాకారుడు మోపర్తి డేవిడ్ రాజులు ప్రసంగించారు.

సభాధ్యక్షులు లక్ష్మయ్య విశ్లేషణ చేయగా న్యాయవాది మురళీధర్ సభా పరిచయం చేయగా ఐవోసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, వందన సమర్పణ చేశారు. కార్యక్రమాన్ని ఆహ్వాన కమిటీ సభ్యులు కొలకలూరి పాపరావు, సుద్దపల్లి కనకరాజు, శీలం వినయ్‌కుమార్, కోడూరు సుదర్శనబాబు, పొన్నెకంటి చక్రవర్తి, అంబేడ్కర్‌లు పర్యవేక్షించారు.

# పెన్షనర్ల వైద్య సేవలకు సిద్ధం




మాట్లాడుతున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

**గుంటూరు మెడికల్:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు, వైద్య సేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఏపీ 48వ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ 2013 నుంచి నేటి వరకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కింద పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్య సేవలు అందిస్తున్న ఏకైక హాస్పిటల్ తమదేనన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పెన్షనర్ల కారణంగానే మోకీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సల్లో తనకు మంచి గుర్తింపు వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు పెన్షనర్ సంఘ నాయకులు డాక్టర్ నరేంద్రరెడ్డిని ఘనంగా సన్మానించారు.

# పాఠకులకు విలువైన సేవలు అందించాలి



పుస్తకాలను పరిశీలిస్తున్న సుబ్బరత్నమ్మ

**గుంటూరు ఎడ్యుకేషన్:** గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు విలువైన సేవలు అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. పుస్తకాలు, గ్రంథాలకు సంబంధించి విభాగాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. పాఠకులు, ఉద్యోగార్థులు, మహిళలు, సీనియర్ సిటిజన్లతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట గ్రంథ పాలకులు బి. శకుంతల, పి.సత్య శిరీష, సిబ్బంది కోటేశ్వరి, పి.సుధాకర్, లక్ష్మి ఉన్నారు.

# పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, సంఘ సభ్యులు

**పాత గుంటూరు:** పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ కె.వి. శివారెడ్డి అన్నారు. గురువారం రాజా గారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం 48వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివారెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఆర్ బకాయిలు రాబట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. బకాయిలు త్వరలోనే ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. కేఎస్ లక్ష్మణరావు, జేఏసీ మాజీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, సి. పురుషోత్తమ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగూర్ షరీఫ్, గుంటూరు జిల్లా ఎన్జీఓ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, సతీష్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డి. వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులుగా అబ్దుల్ కరీమ్ సెక్రటరి జనరల్ జి.ప్రభుదాసు, కోశాధికారిగా శర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.పెద్దన్న గౌడ్ ఎన్నికయ్యారు.

## మద్యం విక్రేత అరెస్ట్

**గుంటూరు ఈస్ట్:** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంజనేయపేట 1వ లైనులో దర్శి నాగచైతన్య తెలంగాణ మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడిచేశారు. నాగచైతన్యను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## సింగిల్ నంబరు ఆట నిర్వాహకుడి అరెస్టు

**గుంటూరు ఈస్ట్ :** సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరండల్‌పేట 14వ లైనులో దాసరి సత్యనారాయణ సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి రూ. 1,350లు నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

## ఉద్యోగం ఆశ చూపి డబ్బులు వసూలు

**గుంటూరు ఈస్ట్:** ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఉద్యోగనగర్‌లో నివసించే కె.సతీష్‌కుమార్‌కు చిలకలూరిపేటకు చెందిన సయ్యద్ హసన్ అలి, వెంకట్ కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసి రూ.5 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

**ఫిరంగిపురం:** వేసవిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత పేర్కొన్నారు. వేములూరిపాడు గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 92 మందికి షుగర్, బీపీ, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. వైద్యురాలు శ్వేత ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

# రైతు కార్మిక ప్రదర్శనకు మద్దతు ర్యాలీ

**తాడేపల్లిరూరల్ :** వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఢిల్లీలో జరిగే రైతు కార్మిక ప్రదర్శనకు మద్దతుగా గురువారం దుగ్గిరాల మండల కేంద్రంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయం సంక్షోభంలో పడిందన్నారు. గిట్టుబాటు ధర లేక నష్టాలు వచ్చి రైతులు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని, అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్కా ములకా శివసాంబిరెడ్డి, మండల రైతు సంఘం కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతు సంఘం అధ్యక్షులు భీమవరపు అమ్మిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం కొల్లూరు మండల కార్యదర్శి బి. సుబ్బారావు, పోతురాజుతదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

**రూ.21లక్షల అపరాధ రుసుం వసూలు**



అధికారులతో సమీక్ష చేస్తున్న టి.శ్రీనివాసబాబు

**గుంటూరు ఈస్ట్:** గుంటూరు విద్యుత్ శాఖ పరిధిలోని బీ-11 సెక్షన్ విద్యానగర్, నవభారత్‌నగర్, భారత్‌పేట, ద్వారకానగర్, వికాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ అధికారులు గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. 59 మంది అధికారులు, 175 మంది సిబ్బంది 59 బృందాలుగా ఏర్పడి 4,534 సర్వీసులు తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 188 మందికి రూ.10.88 లక్షలు అపరాధ రుసుం విధించారు. అదనంగా విద్యుత్ వాడుతున్న 187 మందికి రూ. 10.78 లక్షలు అపరాధ రుసుం విధించారు. అసలు వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన ఒక సర్వీసును గుర్తించి రూ. 10వేలు అపరాధ రుసుం విధించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు టి.శ్రీనివాసబాబు, కె.సూర్యప్రకాష్, పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

**వడ్లమాను(తాడికొండ):** తుళ్ళూరు మండలం వడ్లమాను గ్రామంలోని వేణుగోపాల స్వామి, ఆంజనేయ దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా వల్లంరెడ్డి సుధాకర్ రెడ్డి, కమిటీ సభ్యులుగా జొన్నకూటి శ్రీనివాసరావు, దాసరి అమరనాథ్ బాబు, ఆకారపు నాగలక్ష్మి, గోళ్ళ దేవీకుమారి, డేగల ఏడుకొండలు, పెరికల కోటేశ్వరమ్మలను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి ఆశీస్సులు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

## విద్యార్థులకు సి-విటమిన్ మాత్రలు



**ఫిరంగిపురం:** వేమవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు సి-విటమిన్ మాత్రలు గురువారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ బలకీర్తి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఫ్లోరోసిస్ లక్షణాలు, నివారణను వివరించినట్లు తెలిపారు. ఫ్లోరోసిస్ నీరు, ఉప్పు కలిపిన చిరుతిండ్లు, పొగాకు వల్ల దంతాలు పసుపు రంగులోకి మారతాయని చెప్పారు. వీటి నివారణకు విటమిన్ -సి కలిగిన పండ్లు, మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దివి కమల్‌మోహన్, శేష రవికుమార్ పాల్గొన్నారు.

## హౌస్ గణేషుని ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

**ఫిరంగిపురం:** మండలంలోని హౌస్ గణేషునిపాడు గ్రామ శివారులో ప్రసిద్ధ కొండవీటి రెడ్డి రాజుల కాలంనాటి గణేషుడి విగ్రహాన్ని అగంతుకులు పగలగొట్టారు. దీంతో ఇటీవల మరో నూతన విగ్రహాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ ప్రతిష్టించింది. ఆలయ నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ రూ.10లక్షల నిధులు కేటాయించినట్లు ఆ శాఖ ఈవో ఇ.రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ వి.అనుపమ ఉత్తర్వుల మేరకు గొల్లపూడి కార్యాలయం నిధులు మంజూరు చేసిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.